క్లుప్తంగా

చల్లా, మందా భేటీ



అలంపూర్: ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథం శనివారం హైదరాబాదులో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజకీయ అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

ఆలయానికి బంగారం వితరణ

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి పాగుంటకు చెందిన చిన్న హనుమంతు దంపతులు 4 గ్రాముల బంగారం శనివారం ఆలయ సిబ్బందికి అందజేశారు. అనంతరం వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్రాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాంగ్రెస్‌పార్టీలో చేరిన యువకులు



శాంతినగర్: ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో రాజోళి మండలం ముండ్లదిన్నె చెందిన యువకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. శాంతినగర్‌లోని కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కేసుల విచారణ వేగవంతం చేయండి

గద్వాల క్రైం: కేసుల విచారణలో సిబ్బంది వేగవంతం చేయాల్సిందిగా డీఎస్పీ రంగస్వామి అన్నారు. శనివారం గద్వాల, అలంపూర్, శాంతినగర్ సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా రేషన్ బియ్యం, ఇసుక, మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పేకాట, అత్యాచారాలు, హత్యలు, చోరీలు, రోడ్డు ప్రమాదాలు, చీటింగ్ కేసులలో నిందితులపై తీసుకున్న చర్యలు, చార్జ్‌షీట్ దాఖలు, సాక్షుల సమాచారం తదితర అంశాల రికార్డులను పరిశీలించారు. కేసు నమోదైన క్రమంలో దళారులు, రాజకీయ ఒత్తిళ్లకు తావివ్వకుండా నిష్పాక్షపాతంగా విచారణ చేపట్టాలన్నారు. అత్యవసర సమయాల్లో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాంతినగర్: అనారోగ్య కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే అబ్రహం శనివారం పరామర్శించారు. వడ్డేపల్లి మండలంలోని పైపాడుకు చెందిన నరసింహారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన క్రిష్టఫర్ అనారోగ్యంతో మరణించగా వారి భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇరువురి కుటుంబాల పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. రైతు కుటుంబాలకు వెంటనే రైతుబీమా అందజేయాలని అధికారులను ఆదేశించారు.

సిమెంట్ బెంచీల వితరణ

అలంపూర రూరల్: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో శనివారం నాలుగు సిమెంట్ బెంచీలను లక్ష్మీప్రసాద్, చిన్నరాజు ప్రయాణికులకు వెసులుబాటుగా వితరణ చేశారు. బస్టాండ్ ఆవరణలో బెంచీల ఏర్పాటుపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి భాగవతా సప్తాహం

ధరూరు: మండలంలోని కోతులగిద్ద అరణ్ణేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం నుంచి వారం రోజుల పాటు భాగవతా సప్తాహం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

సెల్‌ఫోన్‌లు రికవరీ చేసిన పోలీసులు

అయిజ: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారి సెల్‌ఫోన్లు చోరీకి గురికావడంతో సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోలీసులు గుర్తించి రికవరీ చేశారు. శనివారం స్టేషన్‌లో 25 మంది బాధితులకు సెల్‌ఫోన్‌లను అందజేశారు. ఎస్‌ఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నా, చోరీకి గురైన వాటిపై జిల్లాలోని పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టిందని పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై డివైడర్‌ను లారీ ఢీకొన్న ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. నేషనల్ హైవే సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు ఇనుప రేకుల లోడ్‌ను వెళ్తున్న లారీ ఇటిక్యాలపాడు శివారులోకి రాగానే జాయింట్ రాడ్ విరిగిపడడంతో హైవేపై డివైడర్‌ను లారీ ఢీకొంది. డ్రైవర్ చందుకు ఎలాంటి గాయాలు కాలేదని లారీ దెబ్బతిన్నదని తెలిపారు. వెంటనే హైవే సిబ్బంది అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

రాయితీ పరికరాలేవి..



సాసనూలులో ఎద్దులతో అచ్చుకొడుతున్న రైతులు

- కనుమరుగవుతున్న సబ్సిడీ పథకాలు
- పెరుగుతున్న సాగు ఖర్చులు
- నియోజకవర్గంలో 88,824 మంది రైతులు

ఎర్రవల్లిచౌరస్తా: ఆధునిక వ్యవసాయం రోజురోజుకు ప్రశ్నార్థకంగా మారుతోంది. వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ పరిజ్ఞానం ఆశించిన స్థాయిలో రైతులకు చేరడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ చేస్తున్న ప్రచారం కార్యరూపం దాల్చడం లేదు. వ్యవసాయ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా అటకెక్కుతున్నాయి. దీంతో రైతన్నల ఆశలపై నీళ్లు చల్లుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాల మంజూరును ప్రభుత్వం పక్కన పెట్టడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యింది. దీంతో సబ్సిడీపై ప్రభుత్వం అందజేసే యంత్రాల కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అందని ద్రాక్షలా రాయితీ..

నియోజకవర్గంలో 7 మండలాలు ఉండగా.. మొత్తం 124 పంచాయతీలు, దీనిలో మొత్తం 88,824 మంది రైతులు కేవలం వ్యవసాయంపై మాత్రమే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే పథకాలు, సబ్సిడీ ద్వారా వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం ప్రతి ఏటా అందించేది. దీనిలో భాగంగా రోటోవేటర్, కల్టివేటర్, తైవాన్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్ కవర్లు, నాగళ్లతో పాటు తదితర వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతులకు నేరుగా పంపిణీ చేసేది. అయితే ప్రస్తుతం రాయితీపై అందజేసే పనిముట్లు అందని ద్రాక్షలా మారడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మంజూరు అంతంత మాత్రమే

యాంత్రీకరణ రాయితీ పరికరాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతుండగా మరోపక్క మంజూరయ్యే యూనిట్లు కూడా నామమాత్రంగా ఉంటున్నాయి. వ్యవసాయ పరికరాలలో భాగంగా తైవాన్ స్ప్రేయర్ లకు మంగళంపాడిన వ్యవసాయశాఖ వాటి స్థానంలో గతేడాది రీచార్జి స్ప్రేయర్‌లను అంతంత మాత్రంగా మంజూరు చేసింది. రైతులకు నిత్యావసరంగా మారిన టార్పాలిన్ కవర్లు కూడా చాలా వరకు తగ్గిపోయాయి. కల్టివేటర్లు మాత్రం జాడే లేకుండా పోయాయి. ఇన్నాళ్లుగా కొనసాగిన వ్యవసాయ సబ్సిడీ యాంత్రీకరణ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.



ఎర్రవల్లిలో ట్రాక్టర్‌తో విత్తనం వేస్తున్న రైతు

ఆయా మండలాల వారిగా ఉన్న రైతులు..

మండలం	రైతులు
ఇటిక్యాల	18,126
మానపాడు	10,175
ఉండవెల్లి	10,717
అలంపూర్	9,519
రాజోళి	9,971
వడ్డేపల్లి	9,657
అయిజ	20,659



ఏటా నిలిచిపోతున్న పథకాలు

వ్యవసాయ రాయితీ పరికరాలు ఒక్కొక్కటిగా 2006–07 నుంచి నిలిచిపోయాయి. సేద్యంలో రైతులకు ఎక్కువగా ఉపయోగపడే నాగళ్లు, ఇతర పరికరాలు 2014 లోనే నిలిచిపోయాయి. ఈ కారణంగా పంట పొలాల్లో ఎద్దులతో పనిచేయాలంటే నిత్యం ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. 2016–17 ఆర్థిక సంవత్సరం వరకు అందుబాటులో ఉన్న 10 నుంచి 12 రకాల వ్యవసాయ పరికరాలు ఆ తరువాత పూర్తిగా కనుమరుగయ్యాయి. దీంతో అన్నదాతలకు అత్యవసరమైన వ్యవసాయ పరికరాలు రాయితీలపై అందకుండా పోతున్నాయి. దీనివల్ల తప్పనిసరి పరిస్థితుల్లో రెట్టింపు ఖర్చు చేసి రైతులు మరింత అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు.

పరికరాలు అందజేయాలి



గతంలో ప్రభుత్వం ప్రతీ ఏడాది సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందజేసేది. ఈ ఏడాది మాత్రం సబ్సిడీ పరికరాలను అందజేయలేదు. దీంతో వ్యవసాయానికి అవసరమైన పనిముట్లను ప్రైవేట్ దుకాణంలో కొనుగోలు చేస్తున్నాం. ధరలు అధికంగా ఉండటంతో పాటు నాణ్యత కూడా సక్రమంగా లేకుండా ఉంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సబ్సిడీపై పనిముట్లను అందజేయాలి.

– రవికుమార్, రైతు, కారుపాకుల

రైతులకు ఇబ్బందులు



ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే పనిముట్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పనిముట్లను ఇవ్వకపోవడంతో ప్రైవేట్‌లో అప్పులు చేసి అధిక ధరలను పెట్టి కొనుగోలు చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ పరికరాలను అందజేసి రైతులకు ఆసరాగా ఉండాలి.

– చిన్న వీరన్న, రైతు, గార్లపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖ ద్వారా రైతులకు రావాల్సిన సబ్సిడీ పరికరాల విషయంపై గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతేడాది కొంత మేరకు వచ్చిన పరికరాలను రైతులకు సబ్సిడీ ద్వారా నేరుగా అందజేశాం. రైతుల సమస్యను మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి ఏవైనా పరికరాలు వస్తే రైతులకు సమాచారం అందించి సబ్సిడీపై పంపిణీ చేస్తాం.

– సక్రియానాయక్, వ్యవసాయ సహాయ సంచాలకులు, అలంపూర్

మొలకెత్తని మిర్చి విత్తనాలతో రైతుల ఆందోళన



మొలకెత్తని విత్తన ప్యాకెట్‌లను చూపుతున్న రైతులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని షాబాద్‌లో మిరప విత్తనాలను రైతులు అధిక సంఖ్యలో కొనుగోలు చేసి నారుమళ్లను ఏర్పాటు చేసి ఇటీవలే విత్తనాలు విత్తారు. ఈ క్రమంలో నారు మళ్లలో విత్తనాలను విత్తి 15 రోజులు కావస్తున్నా మొలక శాతం సక్రమంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఏటా త్వరగా పంట చేతికొస్తుందని బీఏఎస్‌ఎఫ్ కంపెనీకి చెందిన యూఎస్–1081 రకానికి చెందిన మిరప విత్తనాలను రైతులు కొనుగోలు చేశారు. దాదాపు గ్రామంలోని 25 మంది రైతులు విత్తనాలను శాంతినగర్‌లోని ఓ దుకాణంలో గత నెలలో కొనుగోలు చేశారు. విత్తనాలు మొలకెత్తలేదని షాపు యజమానికి దృష్టికి తీసుకెళ్లగా తమను పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోయారు. మొలకెత్తని విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ విషయంపై షాపు యజమాని మాట్లాడుతూ.. షాబాద్‌లో 25 మంది రైతులు బీఏఎస్‌ఎఫ్ కంపెనీకి చెందిన యూఎస్–1081 రకానికి చెందిన మిరప విత్తనాలను తమ షాపులో కొనుగోలు చేశారన్నారు. కంపెనీ నుంచి తమకు రెండు లాట్లు వచ్చాయని ఒక లాటు విత్తనాలు మొలక శాతం సక్రమంగా వచ్చాయని, మరొకటి మాత్రం మొలకశాతం రాలేదని బాధితులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. కంపెనీ అధికారులతో మాట్లాడి రైతుల నారుమళ్లను పరిశీలించి విత్తనాలు మొలకెత్తక పోతే తగిన న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి



శాంతినగర్‌లో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాంతినగర్: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతిని వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఆయన చేసిన సేవలు, వివిధ పథకాలు, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ వంటి పథకాల గురించి కొనియాడారు. కార్యక్రమంలో రవి, నాగరాజు, దేవేంద్ర, గాలిరెడ్డి, భాస్కర్, ప్రభాకర్, రామకృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గోపాల్, రాము, జయన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధరూరులో ..

ధరూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని మండలంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌టీపీ జిల్లా నాయకుడు రాజశేఖర్‌రెడ్డి శనివారం మండల కేంద్రంలోని విగ్రహానికి క్షీరాభిషేకం చేసి అనంతరం పూల మాలలు వేసి నివాళి అర్పించారు. రెండు తెలుగు రాష్ట్రాలను వైఎస్సార్ ఎంతో అభివృద్ధి చేశారని, ఆయన ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్నారన్నారు. ఆనాడు నెట్టెంపాడు జలాలతో మండలాన్ని సస్యశ్యామలం చేశారని, రైతుల బాంధవుడిగా పేరుతెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో నర్సన్న, అంజి, అభిమానులు పాల్గొన్నారు.



ధరూరులో..

బిజ్వారంలో

మల్దకల్: మండలంలోని బిజ్వారంలోని శనివారం వైఎస్సార్ జయంతి ఎంపీపీ రాజారెడ్డి, మాజీ ఎంపీపీ సత్యారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రామ చౌరస్తాలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పాముతో వ్యక్తి విన్యాసాలు



అలంపూర్: పాముతో ఆటలాడుతూ.. విన్యాసాలు చేస్తూ ఓ వ్యక్తి అందరిని ఆశ్చర్యానికి గురి చేశాడు. పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు గుడిసె పరిసరాల్లో పాము సంచరించింది. దీంతో అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన పాములు పట్టే వ్యక్తి ఎర్రన్నను పిలిపించగా ఆయన పామును పట్టుకున్నాడు. విషపు కోరలను తొలగించి పాలు తాపించినట్లు స్థానికులు తెలిపారు. ఆ తర్వాత పాముతో కొద్దిసేపు ఆటాడించాడు. పట్టుకున్న పాములను నదికి అవతలి వైపు ఉన్న ర్యాలంపాడు సమీపంలో ఉన్న అడవిలో వదిలేస్తాడని స్థానికులు తెలిపారు.

ఆదిశిలా క్షేత్రంలో పూజలు

మల్దకల్: మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎమ్మెల్యేగా అవకాశమిస్తే వీఆర్‌ఎస్ తీసుకుంటా..



ఉండవెల్లి: ఎమ్మెల్యేగా అవకాశమిస్తే వీఆర్‌ఎస్ తీసుకుంటానని తక్కశిల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, ఆశయ సాధన వ్యవస్థాపకుడు రాములు తెలిపారు. శనివారం మండలంలోని కంచుపాడులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాకు మెడికల్ కళాశాల రావడం హర్షణీయమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులందరిని కలుస్తున్నానని, కేసీఆర్‌కు వీరాభిమానినని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం మంచి పథకాలతో అందరికి మేలు చేస్తుందని తెలిపారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లోకి వస్తానని ఆయన అన్నారు. ఈ సారి ఎమ్మెల్యేగా ఉపాధ్యాయుడికి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా అవకాశమిస్తే ఉద్యోగానికి వీఆర్‌ఎస్ చేస్తామని తెలిపారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం



మట్టితొలగించే పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న

అయిజ: మున్సిపాలిటీని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై కలిసి కట్టుగా అభివృద్ధి చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. శనివారం 13వ వార్డులో వార్డు కౌన్సిలర్ వెంకటేష్‌తో కలిసి పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. చైర్మన్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని అన్ని కాలనీలలో ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు. అక్కడక్కడ విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇనుప స్తంభాలు ఉన్నాయని వాటిని తొలగించాలన్నారు. కాలనీల్లో ఉన్న పిచ్చి మొక్కలను, సీసీ రోడ్డుపై ఉన్న మట్టిని తొలగింపజేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న మద్దిలేటి

ఉండవెల్లి: అర్హులైన నిరుపేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం(ఐ) జిల్లా నాయకుడు మద్దిలేటి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నాయకులతో కలిసి కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పాలకులు మారినా పేదల బతుకులు మారడం లేదన్నారు. ఎన్నో నిరుపేద కుటుంబాలు 9ఏళ్లుగా ఉమ్మడి కుటుంబాలతో ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వం అర్హులను గుర్తించి ఇళ్ల స్థలాలను కేటాయించి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈదన్న, వెంకట్‌రాముడు, సుంకన్న, శ్రీను, ఆంజనేయులు, శ్రీనివాసులు, శేఖర్, రాముడు, సురేష్, నాగరాజు ఉన్నారు.

సబ్సిడీ గొర్రెలను సద్వినియోగం చేసుకోండి



అయిజలో గొర్రెలు పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారి స్వరూపారాణి



తుమ్మిళ్లలో గొర్రెలను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ

అయిజ: ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న గొర్రెలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి తెలిపారు. రెండో విడుత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో, మండలంలోని బింగిదొడ్డిలో గొర్రెల పంపిణీ చేపట్టారు. బింగిదొడ్డిలో 5 యూనిట్లు, అయిజలో ఒక యూనిట్ గొర్రెల పంపిణీ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు రూ.43,750 చెల్లిస్తే ప్రభుత్వం 75 శాతం రాయితీ రూ.1,31,250 ఇస్తుందని తెలిపారు.

గొర్రెల పంపిణీతో కాపరులకు ఉపాధి

రాజోళి: ప్రభుత్వం అందించే గొర్రెల ద్వారా కాపరులకు ఉపాధి లభిస్తుందని వైస్ ఎంపీపీ రేణుక అన్నారు. మండలంలోని తుమ్మిళ్లలో శనివారం ప్రభుత్వం నుంచి అందుతున్న గొర్రెల యూనిట్ల పంపిణీలో పాల్గొన్నారు. ఆరు యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. గతంలో కూడా గొర్రెలకు తీసుకున్న లబ్ధిదారులు వాటి సంఖ్యను పెంచి లాభాలు గడించారన్నారు. పశు సంవర్ధక శాఖ అధికారి పుష్పలత, సర్పంచ్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



అలంపూర్‌లో సమ్మెలో కూర్చున్న పంచాయతీ కార్మికులు

అలంపూర్: ప్రభుత్వాలు కార్మిక చట్టాలను అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్మికులను నిరవధిక సమ్మె శనివారం కొనసాగింది. వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులను ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. 11వ పీఆర్‌సీ ప్రకారం పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలన్నారు. 51 జీఓను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మమ్మ, కవిత, గిడ్డమ్మ, మద్దిలేటి, శివానంద్, ఎల్లన్న, దేవరాజు, బాలమాశన్న, దాసు, లక్ష్మన్న ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

గద్వాల అర్బన్: పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని బీఆర్‌ఎస్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో చేపట్టిన సమ్మె శనివారంతో మూడో రోజుకు చేరింది. ఈ సమ్మెకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డు, గ్రాడ్యూటీ, పెన్షన్ తదితర డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

శాంతినగర్: పంచాయతీ కార్మికులకు ఇబ్బందికరంగా మారిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్ అన్నారు. వడ్డేపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మె శనివారం కొనసాగింది.

మల్దకల్: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. కార్యక్రమంలో గంగన్న, సవారి పాల్గొన్నారు.

ధరూరు: పంచాయతీ కార్మికులను వెంటనే పర్మనెంట్ చేయడంతో పాటు జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచే వరకు సమ్మె కొనసాగిస్తామని పారిశుద్ధ్య కార్మికులు చంద్రాములు, హనుమంతు తెలిపారు. సమ్మె శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం గేటు వద్ద చేపట్టారు.



గద్వాలలో మాట్లాడుతున్న వెంకట్రాములు

గట్టు: పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలను చెల్లించి, ఉద్యోగ భద్రతను కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహా డిమాండ్‌చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కార్మికులు డిమాండ్ల సాధన కోసం సమ్మెను చేపట్టారు. శిబిరాన్ని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష సందర్శించి సంఘీభావం తెలియజేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారంతో మూడో రోజుకు చేరుకుంది.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారంతో మూడవ రోజుకు చేరుకుంది. సమ్మెలో పాల్గొన్న కంచుపాడుకు చెందిన జీపీ కార్మికుడు దేవన్నకు అకస్మాత్తుగా మూర్ఛ రావడంతో గమనించిన తోటి కార్మికులు ప్రథమ చికిత్స చేసి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.